క్లుప్తంగా

నేడు దసరా మిలాప్

ముషీరాబాద్: అరుంధతి బంధు సేవా మండలి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు భోలక్‌పూర్ డివిజన్ దేవుని తోట ప్రాంగణంలో దసరా మిలాప్–2023 ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి వివిధ పార్టీల నేతలు హాజరవుతారని సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావు తెలిపారు.

బీజేపీకే బీసీల మద్దతు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించడం పట్ల బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాచిగూడలో తెలుగు బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు జోర్రిగల శ్రీధర్ శనివారం మాట్లాడుతూ... బీసీలందరూ బీజేపీకి మద్దతుగా నిలిచి బీసీ అభ్యర్థి ముఖ్యమంత్రి అయ్యే విధంగా చూడాలని కోరారు. బీసీలు బీజేపీకి మద్దతు పలకాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంబర్‌పేట కాంగ్రెస్ టిక్కెట్ లక్ష్మణ్ యాదవ్‌కు ఇవ్వాలి

పంజగుట్ట: కాంగ్రెస్‌కు యాదవులు వెన్నుదన్నులా ఉంటే సీట్ల కేటాయింపులో మాత్రం యాదవులకు తీవ్ర అన్యాయం చేశారని అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎ.రమేష్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభాలో 18 శాతం ఉన్న యాదవులకు కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు టిక్కెట్లు కేటాయించడం సరికాదన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ యువజన విభాగం కో ఆర్డినేటర్ గొర్ల యశ్వంత్ రాజ్‌యాదవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి యాదవులు ఎప్పుడూ వెన్నుదన్నుగా ఉన్నారని తెలిపారు. అంబర్‌పేటలో కూడా ఆర్.లక్ష్మణ్ యాదవ్‌కు మొదటినుండి టిక్కెట్ అని చెప్పి బయటి నుంచి వచ్చిన అగ్రకుల నాయకునికి టిక్కెట్ కేటాయించడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో నేతలు విజయ్ యాదవ్, మల్లేష్ యాదవ్, కిరణ్ యాదవ్, నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పటేల్‌నగర్‌లో పోలీసుల కవాతు


కవాతులో పాల్గొన్న ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్ తదితరులు

అంబర్‌పేట్: ఎన్నికల నిబంధనల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్ హెచ్చరించారు. శనివారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏసీపీ కస్తూరి శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ అశోక్‌లతో కలిసి పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... సమస్యాత్మక ప్రాంతల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. నిరంతరం నిఘా, బందోబస్తుతో ఎన్నికల నిబంధనలు అమలు చేస్తామన్నారు. ఎన్నికల నిబంధనలను ఎవరు అతిక్రమించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి చేశా ఆదరించండి

కాలేరు వెంకటేష్


బాగ్ అంబర్‌పేట మల్లికార్జున్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కాలేరు

అంబర్‌పేట్: ఐదేళ్లుగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాను.. తిరిగి ఈ ఎన్నికల్లో తనను ఆదరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఓటర్లను వ్యక్తిగతంగా కలుస్తూ బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారాక్, గృహలక్ష్మి, రైతుబంధు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్ శాసనసభ్యుడు ముఠా గోపాల్ శనివారం తెల్లవారుజామున తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామి వారి పాదాల దగ్గర బీఫాం పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే దంపతులు, యువ నాయకుడు ముఠా జైసింహ దంపతులు పాల్గొన్నారు.



అంబర్‌పేట కాంగ్రెస్‌లో ప్రకంపనలు!

- రోహిణ్‌రెడ్డి పార్టీలో పట్టు సాధించేనా?
- ఖైరాతాబాద్ టికెట్ ఆశించిన రోహిత్‌రెడ్డి
- అంబర్‌పేట్ టికెట్ కేటాయింపుపై సర్వత్రా చర్చ
- టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న నూతికి మొండిచేయి
- ప్రతి ఎన్నికల్లో వీహెచ్ రాజకీయ చతురత ఈసారి సైతం రిపీట్

అనుహ్య పరిణామాలకు అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ వేదిక అవుతోంది. ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కేటాయింపుపై ఉత్కంఠ నెలకొంటోంటుంది. ఐదేళ్లుగా స్థానికంగా ఉండి టికెట్‌పై ఆశలు పెట్టుకున్న నేతలకు టికెట్ ఖారారు అయిన దాఖాలలు లేవనే చెప్పొచ్చు. అదే సంస్కృతి తాజాగా బయటపడింది.

అంబర్‌పేట్: ఖైరతాబాద్ నియోజవర్గం కాంగ్రెస్ టికెట్ ఆశించిన కాంగ్రెస్ నేత రోహిణ్‌రెడ్డికి అనుహ్య రీతిలో అంబర్‌పేట టికెట్ ఖారారు కావడంపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. గడచిన ఐదేళ్లుగా అంబర్‌పేట టికెట్‌పై ఆశలు పెట్టుకొని పార్టీ కోసం పనిచేసిన నూతి శ్రీకాంత్‌కు పార్టీ మొండిచేయి చూపించింది.

- అంబర్‌పేట్‌లో మాజీ ఎంపీ, సీనియర్ నేత వి.హనుమంతరావు తమదైన శైలిలో రాజకీయం చేస్తూ పార్టీలో టికెట్ ఎవరికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంటుందనే ఆరోపణలు పార్టీ శ్రేణుల్లో ఉన్నాయి. తాజాగా రోహిణ్‌రెడ్డికి టికెట్ రావడం ఊహించని పరిణామం.

గెస్టగానా.. బెస్టా...

గత 25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గంలో ఓడుతూనే వస్తోంది. పార్టీ గెలుపు కాకుండా లోపాయికారిగా ఇతర పార్టీల గెలుపునకు సహకరించిందిని అపవాదు ప్రతి ఎన్నికల్లో మూటకట్టుకుంటోంది. 2009లో జహీరాబాద్ నుంచి ఫరిదుద్దీన్‌ను తీసుకువచ్చి ఎన్నికల బరిలో నిలిపితే అతను ఓడిపోయి నియోజవర్గానికి సంబంధం లేకుండా పోయారు. 2018లో సహితం స్థానికి నేత ఆర్.లక్ష్మణ్ యాదవ్‌కు టికెట్ ప్రకటించి బీఫాం అందించింది. అతను బీఫాం తో నామినేషన్ వేశారు. నామినేషన్ ఉపసంహరణ చివరి రోజు అతను నామినేషన్‌ను ఉపసంహరించుకోవడం అప్పట్లో సంచలనంగా మారింది. అనూహ్య పరిణామలతో కోదండరాంకు పొత్తుల్లో కేటాయిస్తే అతనికి 5 వేల ఓట్లు కూడా రాలేదు. కాంగ్రెస్‌లో పరిణామాలతో 2009లో బీజేపీ లాభపడితే, 2018లో బీఆర్ఎస్ లాభపడింది. తాజాగా రోహిణ్‌రెడ్డి అభ్యర్థిత్వంతో ఏ పార్టీకి లాభం చేకూరుతుందో వేచి చూడల్సిందే.

ఏ లెక్కన...

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రెండో జాబితాలో అంబర్‌పేట టికెట్‌ను ఖైరాతాబాద్ టికెట్ ఆశించిన రోహిణ్‌రెడ్డికి కేటాయించారు. దీంతో ఐదేళ్లుగా టికెట్ ఆశించిన ఆర్.లక్ష్మణ్ యాదవ్, మోతే రోహిత్ భంగపడ్డారు. వీహెచ్ మద్దతు ఆర్.లక్ష్మణ్ యాదవ్‌కు పూర్తి స్థాయిలో ఉన్నా అతనికి టికెట్ రాలేదు. పార్టీ చేపట్టిన సర్వేల్లో నూతి శ్రీకాంత్‌గౌడ్‌కు అనుకూలంగా ఉన్నట్లు వచ్చిన సమాచారంపై అతనికి టికెట్ పక్కా అని అంత భావించారు. నూతి శ్రీకాంత్‌గౌడ్‌కు టికెట్ వస్తే అంబర్‌పేట్‌లో మెజార్టీ ఓట్లు ఉన్న గౌడ సామాజిక వర్గంతో పాటు మైనార్టీల మద్దతు లభిస్తుందని రాజకీయ పరిశీలకులు భావించారు. అతను బరిలో ఉంటే బలమైన బీఆర్ఎస్, బీజేపీలకు ఇబ్బందికర పరిణామాలు ఎదురవుతానే చర్చ జరిగింది. తాజాగా అతనికి టికెట్ రాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో ఓ వర్గం తీవ్ర అసంతృప్తిగా ఉంది. ఇక ఎన్నికల పోరు బీఆర్ఎస్, బీజేపీ మధ్యలో అని తేలింది.

రోహిణ్‌రెడ్డి రాణించేనా...


రోహిణ్‌రెడ్డి తన కుటుంబం నేపథ్యం అంబర్‌పేట నియోజవర్గానికి చెందినా ప్రస్తుతం బంజరాహిల్స్‌లో నివాసం ఉంటున్నారు. ఎన్నికలపై పూర్తిగా సిద్ధపడి ఖైరాతాబాద్‌లో కసరత్తు చేసుకున్నారు. చివరికి కాంగ్రెస్ పార్టీ అంతగా బలంగా లేని అంబర్‌పేట బరిలో నిలవాల్సి రావడం అతను కూడా ఊహించి ఉండక పోవచ్చు. 2009, 2018ల మాదిరిగానే ఇక్కడి పార్టీ శ్రేణులు వ్యవహరిస్తారా లేక, సహకరిస్తారా కొద్ది రోజుల్లో బయటపడుతుంది. రోహిణ్‌రెడ్డికి నగర రాజకీయాల్లో మంచి అవగహన, అనుబంధం ఉన్నా అంబర్‌పేటలో రాణించడం కత్తిమీద సామే అనడం అక్షర సత్యం.

ముషీరాబాద్ బీజేపీలో ఓసీ నినాదం!

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర వ్యాప్తంగా సీట్ల కేటాయింపులో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చింది. ఇంకొంచె ముందుకు వెళ్లి అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని స్పష్టం చేసింది. అయితే అందుకు బిన్నంగా ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీలో మాత్రం ఆ పార్టీ నాయకులు ఓసీ గళం వినిపిస్తున్నారు.

- ఏళ్ల తరబడి పని చేస్తున్నా అవకాశాలు రావడం లేదని ఆవేదన
- జనరల్ స్థానాలలో సైతం బీసీలకు టికెట్లు ఇస్తున్నారని నిట్టూర్పు
- ముషీరాబాద్ ఎమ్మెల్యే టికెట్ ఓసీలకు ఇవ్వాలని డిమాండ్


టికెట్ కోసం పోటీ పడుతున్న రమేష్‌రామ్


డి.ఎస్.రెడ్డి


సూర్యనారాయణశర్మ

ముషీరాబాద్: మూడు దశాబ్దాలకుపైగా ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి డాక్టర్ కె.లక్ష్మణ్ పోటీ చేస్తుండటంతో ఓసీలు ఆయనకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించారని ఈ ఎన్నికల్లో లక్ష్మణ్ పోటీ చేయకపోవడంతో ఈసారి ఓసీలకు అవకాశం కల్పించాలని టికెట్ కోసం పోటీ పడుతున్న రమేష్‌రామ్ (పార్టీ నియోజకవర్గ కన్వీనర్), సి.గోపాల్‌రెడ్డి, సూర్యనారాయణశర్మ, నైషదం సత్యనారాయణమూర్తి, డి.ఎస్.రెడ్డి కోరుతున్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులకు టికెట్లు ఇచ్చి ఓసీలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆర్యవైశ్యులు, రెడ్డి, బ్రాహ్మణులు, ఇతర అగ్ర కుల సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు 50–60 వేల వరకు ఉంటారు.
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీ అభ్యర్థులకు టికెట్లు ఇచ్చారు. కాబట్టి బీజేపీ ఓసీ కమ్యూనిటీకి టికెట్ కేటాయించినట్లు అయితే ఆ ఓట్లు బీజేపీ వైపు మళ్లే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.
- ముషీరాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్ దాదాపు 30 ఏళ్లుగా పోటీ చేస్తు విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన రాజ్యసభ సభ్యులుగా, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా, పార్లీమెంటరీ కమిటీ సభ్యులుగా, ఎలక్షన్, సెలక్షన్ కమిటీ సభ్యులుగా జాతీయ స్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్నందున ఆయన స్థానాన్ని ఓసీ అభ్యర్థికి కేటాయిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.
- గత కార్పొరేషన్ ఎన్నికల్లో జనరల్ స్థానం అయిన రాంనగర్ డివిజన్ నుంచి బీసీ అభ్యర్థిని కార్పొరేటర్‌గా నిలబెట్టడంతో ఓసీ అభ్యర్థికి అన్యాయం జరిగింది.
- అలాగే గత కార్పొరేషన్ ఎన్నికల్లో జనరల్ మహిళకు కేటాయించిన అడిక్‌మెట్ డివిజన్‌లో బీసీ మహిళను నిలబెట్టడంతో బీజేపీలో ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్న ఓసీ నాయకుడు కొండపల్లి మాధవ్ బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో ముషీరాబాద్ అసెంబ్లీ టికెట్‌ను ఓసీలకు కేటాయించాలని కోరుతున్నారు.


నైషదం సత్యనారాయణమూర్తి


సి.గోపాల్‌రెడ్డి

కాంగ్రెస్ టికెట్‌పై అధిష్టానం పునరాలోచించాలి


నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నేతలు

నల్లకుంట: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పునరాలోచించి అంబర్‌పేట నియోజకవర్గం టికెట్‌ను బీసీ బిడ్డ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌కు కేటాయించాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎం.సాయి నితీష్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ కార్డుతో రాజకీయాలు చేస్తున్న మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు (వీహెచ్) అధిష్టాన్ని బెదిరిస్తూ అగ్ర వర్ణాల నాయకుల కొమ్ము కాస్తూ బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. బీసీలకు పెద్ద పీట వేస్తామని పార్టీ అధిష్టానం ఓ వైపు చెబుతూనే అంబర్‌పేట టికెట్‌ను స్థానికేతరుడు, అగ్రవర్ణానికి చెందిన వ్యక్తికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. రోహిణ్ రెడ్డికి టికెట్ కేటాయింపుపై ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో శనివారం నల్లకుంట తిలక్ నగర్ గాంధీ బొమ్మ వద్ద నిరసన తెలియజేస్తూ వీహెచ్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సాయి నితీష్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థి రోహిణ్‌రెడ్డికి హనుమంతరావు రూ. 2.5 కోట్లకు టికెట్ అమ్ముకున్నారని ఆరోపించారు. టికెట్ అమ్ముకోలేదని అంబర్‌పేట మహంకాళి ఆలయంలో ప్రమాణం చేసి తన నిజాయితీని నిరూపించుకోవాలని వీహెచ్‌కు సవాలు విసిరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర జాయింట్ కో ఆర్డినేటర్ ప్రదీప్ కుమార్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సద్దాం, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి నర్సం గౌడ్, హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సోహైల్, హరికృష్ణ గౌడ్, శశి గౌడ్, శివా రెడ్డి, సునీల్, అనిల్ సాయి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బడుగులకు న్యాయం

ముషీరాబాద్: బీఎస్పీతోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని బీఎస్పీ సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జీ నరేందర్ అన్నారు. శనివారం భోలక్‌పూర్, అడిక్‌మెట్ డివిజన్‌లలోని అంజయ్య నగర్, బద్దెరబస్తీలలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ బీఎస్పీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ... స్థానికంగా మంచినీరు, డ్రైనేజీ సమస్యలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాన్షీరాం ఆశయాలకు, సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తామని పేర్కొన్నారు. బీఎస్పీ నాయకులు విశ్వచారి, బండారి శ్రీనివాస్, నందకుమార్, ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు పరమేశ్వర్, భాస్కర్, ఉపాధ్యక్షుడు రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.


అంజయ్యనగర్‌లో ప్రచారం చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఎట్టకేలకు మ్యాన్‌హోల్ మరమ్మతు



అంబర్‌పేట్: మ్యాన్‌హోల్ సిథిలావస్థలోకి చేరడంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబర్‌పేట సీపీఎల్ ప్రధాన రోడ్‌లో కొంతకాలంగా ప్రధాన రోడ్‌పై డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లు సిథిలావస్థలోకి చేరాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎట్లకేలకు జలమండలి అధికారులు స్పందించి శనివారం మరమ్మతులు చేశారు.


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సుధాకర్, డాక్టర్ తిప్పర్తి యాదయ్య తదితరులు

ఘనంగా వాల్మీకి జయంతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహా రుషి వాల్మీకి మేతర సంఘం ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లిలోని సూర్యనగర్‌లో వాల్మీకి జయంతి ఉత్సాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ... మహాకవి వాల్మీని స్మరించుకోవడం అభినందనీయమన్నారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, మహా రుషి వాల్మీకి మేతర సంఘం అధ్యక్షులు రాజేందర్(పప్పు), ప్రధాన కార్యదర్శి జె.సురేందర్, ఉపాధ్యక్షులు సుభాష్, కమిటీ నాయకులు అనిల్, సునీల్, అహిమన్యు, విక్కీ, శివ, వికాస్, ప్రీతం, సాహిల్, శ్యామ్‌లాల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చిక్కడపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో లభించింది. ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సమాచారం మేరకు... అప్పర్ ట్యాంక్‌బాండ్ చిల్డ్రన్ పార్క్ సమీపంలో 50 ఏళ్ల వ్యక్తి పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికెళ్లి గుర్తుతెలియని వ్యక్తి శవాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలలో బెగ్గింగ్ చేస్తుంటాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో ఆర్‌జేసీసీ ఘన విజయం

సెంచరీతో చెలరేగిన మిథుల్ శ్రీవత్స



ముషీరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో సి డివిజన్ వన్‌డే లీగ్ మ్యాచ్ ఆర్‌జేసీసీ, సికింద్రాబాద్ జింఖానా జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌జేసీసీ జట్టు 30 ఓవర్లల్లో ఒక వికెట్ నష్టానికి 214 పరుగులు చేసింది. ఆ తరువాత బ్యాటింగ్ చేసిన సికింద్రాబాద్ జింఖానా జట్టు 30 ఓవర్లల్లో 8 వికెట్లు నష్టపోయి 166 పరుగులు చేసింది. 48 పరుగుల తేడాతో ఆర్‌జేసీసీ జట్టు విజయం సాధించింది. సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాల విద్యార్థి, రాంనగర్ పార్సిగుట్ట కుర్రోడు జి.మిథుల్ శ్రీవత్స జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. కల్లు చదిరే షాట్‌లతో 99 బంతుల్లో సెంచరీ పూర్తి చేసి నాట్ అవుట్‌గా నిలిచాడు. ఇందులో మైదానం నలువైపుల పది ఫోర్లు కొట్టి క్రీడాభిమానులకు అలరించాడు.

బీసీ సీఎం ప్రకటనపై బీజేపీ సంబురాలు


బర్కత్‌పురాలోని బీజేపీ కార్యాలయంలో సంబురాలు నిర్వహిస్తున్న దృశ్యం

కాచిగూడ: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ అభ్యర్థినే ముఖ్యమంత్రిగా చేస్తామని పార్టీ అగ్రనేత, కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించడం పట్ల బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు సీట్స్ పంపిణీ చేసి సంబురాలు జరుపుకొన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, అచ్చిని రమేష్, వనం రమేష్, శ్యామ్‌రాజ్, ఎ.సూర్య ప్రకాష్‌సింగ్, ప్రణయ్ సింగ్, ఎంబి కిషోర్ కుమార్, వెంకటస్వామి, మహేష్, అనిల్ చారి, డి.రమేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ముషీరాబాద్ టికెట్‌ను వినయ్‌కుమార్‌కు కేటాయించాలి

చిక్కడపల్లి: బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పద్మశాలీ వర్గానికి చెందిన బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్‌కు టికెట్ కేటాయించాలని సంఘం నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్‌లను కోరారు. ప్రజా పద్మశాలీ సంఘం ముషీరాబాద్ ఆధ్వర్యంలో శనివారం అశోక్‌నగర్‌లోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పద్మశాలీ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, చేనేత వర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు చిక్కాదేవదాస్, పద్మశాలీ ప్రజా సంఘం ముషీరాబాద్ అధ్యక్షుడు తలకొక్కుల సందీవ కుమార్ మాట్లాడుతూ... ముషీరాబాద్ నియోజవర్గం రూ. 55 వేలకు పైగా పద్మశాలీలు ఉన్నారన్నారు. ఈ సామాజిక వర్గానికి చెందిన వినయ్‌కుమార్‌కు బీజేపీ అభ్యర్థిగా ప్రకటించాలన్నారు. ముషీరాబాద్ పద్మశాలీ సంఘం కోశాధికారి పాచికంటి నాగమూర్తి, సంఘం నాయకులు చెరుకుపల్లి గణేష్, బల్లప్రశాంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన పద్మశాలీ నేతలు

గ్రంథాలయ సిబ్బందికి జీతాలు ట్రెజరీ నుంచి చెల్లించాలి



మాట్లాడుతున్న దేవేందర్

చిక్కడపల్లి: తెలంగాణ గ్రంథాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు, పెన్షన్లను 010 పద్దు కింద చెల్లించాలని తెలంగాణ జిల్లా గ్రంథాలయాల సంస్థల పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కుల దేవేందర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం దేవేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్లకు శాలరీ గ్రాంట్ కింద ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తోందన్నారు. వాటిని ఏ 010 పద్దు కింద ట్రెజరీ నుంచి చెల్లించినట్లయితే ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం ఉండదన్నారు. గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వాలకు 010 పద్దు కింద ట్రెజరీ నుంచి జీతాలు, పెనన్లు చెల్లించాలని ఎన్నోసార్లు వినతులు చేశామని, వినతిపత్రాలు సమర్పించామన్నారు. ప్రభుత్వాలు మాత్రం స్పందించడంలేదన్నారు. జిల్లా గ్రంథాలయాల ద్వారా విద్యార్థులకు, ప్రజలకు విజ్ఞానం అందిస్తున్న ఉద్యోగులు, పెనసర్ల సమస్యలను వచ్చే ప్రభుత్వమైనా పరిష్కరించి జీతాలు,పెన్షన్లు ట్రెజరీ ద్వారా చెల్లించాలని కోరారు. హెల్త్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి నవనీతరావు పాల్గొన్నారు. లైబ్రరీ పెన్షనర్ల రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి సోమశివయ్య, కోశాధికారి దాచేపల్లి బుచ్చయ్య, తుమ్మ సత్యనారాయణ, కె.వీరప్ప, బొల్లం మహేందర్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్, కరాటేలో ఉచిత శిక్షణ

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్‌లోని భవానినగర్ కాలనీలోని భవాని మహిళా మండలిలో మహిళలకు ఉచితంగా బేసిక్ టైలరింగ్‌లో శిక్షణ, కరాటే తరగతులు నిర్వహిస్తున్నట్లు మండలి అధ్యక్షురాలు శేషుకుమారి తెలిపారు. ఆసక్తి గల మహిళలు తమ పేర్లను వచ్చే నెల 1వ తారీఖులోగా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9391318407 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అన్ని పాఠశాలల్లో 'సీఎం అల్పాహారం'ను అమలు చేయాలి


పాఠశాలలో అల్పాహారాన్ని పరిశీలిస్తున్న కల్పన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సీఎం అల్పాహారం పథకాన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. శనివారం ముషీరాబాద్ పాఠశాలలో అల్పాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ... ప్రభుత్వం అర్భాటంగా ప్రవేశపెట్టిన అల్పాహారం పథకం అమలు మండలంలోని ఒకే పాఠశాలకే పరిమితం చేయడం తగదన్నారు. నాణ్యమైన అల్పాహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. నగర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. యంత్రాంగాన్ని సిద్ధం చేయకుండా ఎన్నికల నోటిఫికేషన్ ముందు పథకాన్ని ప్రకటించడం చూస్తుంటే ఓట్ల పథకం లాగానే ఉందన్నారు. మధ్యాహ్న భోజనాన్ని బయట నుంచి తీసుకొస్తుండడంతో చల్లగా అయి విద్యార్థులు తినలేక పోతున్నారన్నారు. డీబీఎఫ్ సిటీ నాయకుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.